
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# డిసిసి చీఫ్ ఇంట పెళ్లి సందడికి సిఎం రాక



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షులు తోటకూర వజ్రేశ్యాదవ్ కుమారుని వివాహ వేడుక ఆదివారం నగరంలో అత్యంత వైభవంగా జరిగింది. నగరంలోని ది అడ్రస్ కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ వివాహ మహోత్సవంలో వజ్రేశ్యాదవ్ కుమారుడు శ్రవణ్ యాదవ్ శ్రీపవిత్రలు ఒక్కటయ్యారు. ఈ వేడుకకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో ముఖ్యమంత్రితో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.



అదనపు కలెక్టర్ కిరణ్మయికి పుష్పగుచ్ఛం ఇస్తున్న కలెక్టర్

# గ్రామీణంపై స్పెషల్ ఫోకస్

**మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తా**

**నూతన అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి**

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఆమె కామారెడ్డి జిల్లా బాన్సువాడ సబ్ కలెక్టర్గా విధులు నిర్వహించి, పరిపాలనలో తనదైన ముద్ర వేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమర్థతతో గుర్తింపు పొందిన ఆమెకు తాజా బదిలీతో రంగారెడ్డి జిల్లాలో కీలక బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా అభివృద్ధి, స్థానిక సంస్థల బలోపేతం, గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని డాక్టర్ కిరణ్మయి తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. జిల్లా అధికారులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి, కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. రంగారెడ్డి జిల్లా పరిపాలనలో ఆమె సేవలు ముందుకు తీసుకువస్తాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఒకే విడతలో స్థానిక సమరం?

**మండల పరిషత్, జడ్పీ ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికారులు**

**తుది దశలో ఓటర్ల జాబితా**

**నోటిఫికేషన్పై ఉత్కంఠ**

**రాజకీయ పార్టీల్లో మొదలైన కదలికలు**

**కార్యాచరణకు సిద్ధమవుతున్న ఆశావహులు**

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల కోసం రాజకీయ వర్గాలు, ఆశావహులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ పదవీకాలం ముగిసి దాదాపు సంవత్సరం కావస్తున్నా ఎన్నికలు జరగకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ కార్యకలాపాలు మందగించాయి. ఈసారి అయినా ఎన్నికలు జరుగుతాయా..? లేక గతంలో మాదిరిగానే చివరి నిమిషంలో వాయిదా పడతాయా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతోంది. ఇప్పటికే అధికారులతో ఉన్నతస్థాయి సమావేశాలు నిర్వహిస్తూ ఎన్నికల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఒకే విడతలో ఎన్నికలు నిర్వహించి 15-20 రోజుల్లో మొత్తం ప్రక్రియ పూర్తి చేయాలనే ఆలోచన కూడా ఉన్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన పరిణామాల ప్రకారం పరీక్షలు, బడ్జెట్ సమావేశాలు, రిజర్వేషన్ల అంశాలు వంటి కారణాలతో ఎన్నికలు కొంతకాలం వాయిదా పడ్డాయి. అయినప్పటికీ త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి.

**జిల్లాలో 230ఎంపీటీసీ స్థానాలు**





రంగారెడ్డి జిల్లాలో మొత్తం 21 మండలాల్లో జడ్పీటీసీ, 230ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు.

**పోలింగ్ కేంద్రాల ఎంపికలో నిమగ్నం**

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల స్థాయిలో అధికారులు పనులను ముమ్మరం చేశారు. ఎంపీటీసీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితా సవరించడం, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, సిబ్బంది నియామకం వంటి పనులు కొనసాగుతున్నాయి.

**త్వరలో ఓటర్ల తుది జాబితా**

కొత్తగా నమోదైన ఓటర్ల పేర్లు చేర్చడం, మరణించిన వారి పేర్లు తొలగించడం ద్వారా ఓటర్ల తుది జాబితాను సిద్ధం చేస్తున్నారు. త్వరలోనే ఫైనల్ లిస్ట్ విడుదల కానుంది.

ఎన్నికలపై స్పష్టత వస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ కదలికలు వేగం పుంజుకున్నాయి. పార్టీ నాయకులు, ఆశావహులు ప్రచారానికి సిద్ధమవుతూ కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. నోటిఫికేషన్ ఎప్పుడొస్తుందా అన్న ఉత్కంఠ మధ్య ఎన్నికల వేడి రోజురోజుకు పెరుగుతోంది.

# మూడు రోజులే గడువు

**రైతు నమోదు తప్పని సరి - ఆలస్యం చేస్తే పథకాలపై ప్రభావం**
**-జిల్లా వ్యవసాయ అధికారిణి ఉష సూచన**

**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులందరూ తప్పనిసరిగా రైతు నమోదు ప్రక్రియ పూర్తి చేసి నమోదు గుర్తింపు సంఖ్య పొందాలని జిల్లా వ్యవసాయ అధికారిణి డి. ఉష పిలుపునిచ్చారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, బీమా సదుపాయాలు సకాలంలో అందాలంటే రైతు నమోదు కీలకమని ఆమె స్పష్టం చేశారు. రైతు నమోదు ద్వారా ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత పెరగడమే కాకుండా, అర్హులైన ప్రతి రైతుకూ లబ్ధి నేరుగా చేరే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా రైతు బీమా, పంట రుణాలు, ప్రత్తి, వరి కొనుగోలు వంటి వ్యవహారాల్లో నమోదు సంఖ్య అత్యంత అవసరమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు కూడా నమోదు ఉన్న రైతులకే సులభంగా అందనున్నాయని వివరించారు. నమోదుకు అవసరమైన పత్రాలు.. రైతులు ఆధార్ కార్డు, భూమి పట్టా పాసు పుస్తకం, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్ తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచించారు.

**ఎక్కడ నమోదు చేసుకోవాలి... ?**

గ్రామ పరిధిలోని రైతు వేదికల వద్ద వ్యవసాయ విస్తరణ అధికారుల ద్వారా, అలాగే సమీప మీసేవ కేంద్రాల్లో రైతు నమోదు సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. ప్రత్యేక నమోదు కార్యక్రమం ఏప్రిల్ 22 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజ్ఞప్తి చేసింది. రైతుల భవిష్యత్ అవసరాలు, ప్రభుత్వ సహాయం నిరంతరంగా అందాలంటే రైతు నమోదు మొదటి అడుగని అధికారులు పేర్కొన్నారు.

# స్వీయ గణనలో ప్రతి ఒక్కరు పాల్గొనాలి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** జనగణనలో భాగంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలో జరుగుతున్న స్వీయ గణనలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని, ఈ నెల 26వ తేదీ నుంచి మే 10వరకు కొనసాగుతుందని, మీ స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా నమోదు చేసుకోవటానికి ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను రూపొందించినట్లు దీనిని ప్రజలు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి కోరారు. ఆదివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో విలేకరుల (ప్రెస్‌మీట్) సమావేశం ఏర్పాటు చేశారు. జనగణనలో భాగంగ నిర్వహిస్తున్న స్వీయ గణనలో ప్రతి ఒక్కరు పాల్గొనాలనే అనే విషయంపై మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చి గణాంకాలు సేకరించే వారని, ప్రస్తుతం ప్రభుత్వం స్వయంగా ప్రజలే స్వీయగణన వివరాలను మీ స్మార్ట్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. జనాభా గణనలో భాగంగా ప్రజలు తమ కుటుంబ వివరాలను ఆన్‌లైన్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే కొత్త డిజిటల్ సౌకర్యంను కల్పించిందన్నారు. గణన అధికారి ఇంటికి రాకముందే ఖచ్చితమైన సమాచారంను అందిస్తుందన్నారు. 15నిమిషాల్లోనే ఈ ప్రక్రియ పూర్తి అవుతుందని, గణన అధికారి ఇంటికి రాకముందే వివరాలను నమోదు చేసుకునే అవకాశం పోర్టల్ అందుబాటులో ఉంటుందన్నారు. స్వీయ గణన చేసుకునేందుకు క్యూఆర్‌కోడ్‌ను కూడ అందుబాటులో ఉంచారని అన్నారు. ఈ కోడ్‌ను స్కాన్ చేసి లేదా అందుకు కేటాయించిన ప్రత్యేక వెబ్‌పోర్టల్‌లోకి వెళ్లి కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ వివరించారు. ఆ తరువాత 11అంకెల సంఖ్య (ఎస్ఈఐడి) వస్తుందని, మే నెలలో జనగణన సిబ్బంది ఇంటికి వచ్చినపుడు వారికి ఐడిని చూపించినట్లేతై వారే నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారని అన్నారు. నమోదు చేసుకోవటం ఎలా దానిపై వివరించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ సమయంలో వ్యక్తులు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవటం స్వీయ గణన కోసం అధికారిక వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలని, లాగిన్ ప్రక్రియలో భాగంగ రాష్ట్రం, క్యాప్సాను నమోదు చేసి వెరిఫై



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

చేయాలన్నారు. ఆ తరువాత యజమాని పేరు, ఫోన్‌నెంబరు, ఈ-మెయిల్ ఐడి నమోదు చేస్తే ఫోన్‌కు ఆరు అంకెల సందేశం వస్తుందన్నారు.

నమోదు చేసిన తరువాత నమోదు ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. శాటిలైట్ మ్యాప్ కనిపిస్తూనే మీ చిరునామా, పిన్‌కోడ్ నమోదు చేయాలని అడుతుందన్నారు. మీరు ఇచ్చే సమాచారం అధారంగ ఆకాంక్షలు, రేఖాంక్షల వివరాలను తీసుకుని మీ ఇంటిని మ్యాపులో నమోదు చేస్తుందన్నారు. ఆ తరువాత ప్రశ్నావళి ప్రారంభం అవుతందని, మీ ఇల్లును మట్టితో నిర్మించారా, లేక సిమెంట్‌తో నిర్మించారా వీటి గోడల పరిస్థితి ఏ విధంగ ఉంది. అదే విధంగ మీ ఇళ్లు పరిస్థితి ఏ స్థితిలో ఉంది ఇలా 30ప్రశ్నలకు సమాధానాలను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. కుటుంబ సభ్యుల పేర్లు, వయసు, వారి విద్యార్హతలు అన్నినమోదు చేసుకుని సేవ్ చేసుకుంటూ వెళ్లితే చివరకు ప్రివ్యూ చూసుకుని సబ్‌మిట్ చేయాలని అడుతుందని, ఆ పై సబ్‌మిట్ చేయగానే ఓ రెఫరెన్స్ నెంబరు వస్తుందన్నారు. తరువాత క్రమంలో ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినపుడు ఆనెంబరు ఇస్తే సరిపోతుందని, మళ్లీ మన వివరాలను చెప్పాల్సిన అవసరం ఉండదని, అన్ని ప్రాంతీయ భాషల్లో వివరాలను నింపేలా సౌకర్యం కల్పించబడిందన్నారు. ముందుగానే స్వీయ గణన చేసుకోవటం వల్ల జనాభా గణన సిబ్బందికి పని తక్కువ అవుతుందని అన్నారు.



## ఘనంగా వెంకన్న కల్యాణం

**శామీర్‌పేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** కేశవరంలోని శ్రీబాలాజీ వేకంటేశ్వరస్వామి ఆలయంలో శ్రీస్వామి వారి కల్యాణోత్సవం కన్నుల పండుగగా వైభవంగా ఘనంగా జరిగింది. ఆదివారం మూడుచింతలపల్లి మండలంలోని కేశవరంలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీస్వామి వారి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ఈ నెల 25నుంచి 30వ తేదీ వరకు శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగ ఆదివారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. శ్రీస్వామి వారి కల్యాణోత్సవం సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని తరువాత ఆలయంలో శ్రీస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమేశ్‌గుప్త, ఆలయ కమిటీ సభ్యులు, మూడుచింతలపల్లి మున్సిపాల్టీ కేశవరం గ్రామ కౌన్సిలర్లు బొమ్మలపల్లి మల్లేశ్‌యాదవ్, కొంపల్లి మాదవిభూమేశ్‌గౌడ్, ఆలయ మాజీ చైర్మన్ జి.హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.మహేందర్‌రెడ్డి, గ్రామ నాయకులు యు.బాల్‌రాంగౌడ్, చిత్తారి, మల్లేశ్, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రాచీన ఆలయానికి కొత్త రూపు

**పునర్నిర్మాణానికి రూ. 1.50కోట్ల విరాళం**

**సర్పంచ్ ఔదార్యాన్ని అభినందిస్తున్న గ్రామస్తులు**

**దుద్యాల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హకీంపేట్ గ్రామంలో శిథిలావస్థకు చేరిన హనుమాన్ ఆలయాన్ని స్థానిక సర్పంచ్ గజ్జల నరసింహారెడ్డి తన సొంత డబ్బులతో పునర్నిర్మించి భక్తులకు, గ్రామస్తులకు నూతన ఉత్సాహాన్ని అందించారు. గ్రామం పై మమకారంతో సుమారు ఒక కోటి 50 లక్షల సొంత నిధులతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. సుమారు 80 సంవత్సరాల క్రితం నిర్మించిన హనుమాన్ ఆలయాన్ని పునర్నిర్మించడానికి పూనుకొని పనులు ప్రారంభించిన దివంగత గజ్జెల బాల్ రెడ్డి, శారదమ్మ కుటుంబాన్ని ఆదరించిన గ్రామస్తులు స్థానిక ఎన్నికల్లో రవీంద్ర నరసింహారెడ్డిని సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. 60 గజాలలో ఉన్న పురాతన ఆలయాన్ని సుమారు 250 గజాల విస్తీర్ణంలో విశాలంగా, అందంగా తీర్చిదిద్దారు. ఆలయంలో హనుమాన్ విగ్రహం, గణపతి విగ్రహం, శివలింగం ఉండేవి. పునర్నిర్మిత ఆలయంలో ఆంజనేయ విగ్రహంతో పాటు సీతారామ, గణపతి, సుబ్రమణ్యేశ్వర, దత్తాత్రేయ, ఈశ్వర, నవగ్రహ విగ్రహాలు ప్రతిష్టించనున్నారు. విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు ఈనెల 28 నుండి 30 వరకు అత్యంత వైభవంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం నుండి పూజ కార్యక్రమాలతో ప్రారంభమై వివిధ కార్యక్రమాలతో గురువారం నాడు విగ్రహాల ప్రతిష్టాపన చేయనున్నారు. పుట్టిన ఊరికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో హనుమాన్ ఆలయాన్ని పునర్నిర్మిస్తున్న నరసింహారెడ్డి, కుటుంబ సభ్యులను గ్రామస్తులు అభినందిస్తున్నారు. భగవంతుని సేవలో తన వంతు పాత్ర పోషించడం సంతోషంగా ఉందని నరసింహారెడ్డి తెలిపారు.



పునర్నిర్మాణం చేసిన ఆంజనేయ స్వామి ఆలయం. (ఇన్‌సెట్) దాత నరసింహారెడ్డి

# ఎలుకగూడెం సర్పంచిపై హత్యాయత్నం కేసులో నిందితుడి కోసం వేట

**షాద్‌నగర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం జిల్లేడు చౌదరిగుడా మండలం ఎలుకగూడెం గ్రామ సర్పంచి బందెయ్య పై హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అరుణ, మాజీ ఎంపీటీసీ ప్రతాప్ రెడ్డిల కుమారుడు రాంరెడ్డి. అయితే ఇతను వృత్తిరీత్యా సింగపూర్‌లో వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం అందుతోంది. గ్రామ రాజకీయాల్లో క్రియాశీల పాత్ర పోషిస్తున్న రాంరెడ్డి. అడపాదప సింగపూర్ నుండి ఎలుకగూడెం గ్రామానికి రాంరెడ్డి వస్తు పోతూ ఉంటాడు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 24న అర్ధరాత్రి విమానం దిగిన రాంరెడ్డి గ్రామానికి వచ్చాడు. గ్రామంలో జరుగుతున్న ఈదమ్మ జాతర సందర్భంగా సర్పంచి బందెయ్య అన్ని ఏర్పాట్లు తానే దగ్గరుండి చూస్తున్నాడు. గ్రామ సర్పంచి కాబట్టి ఆనవాయితీ ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. మరి కాసేపట్లో జాతర మొదలవుతుంది అని తెలియగానే రాంరెడ్డి, అతని అనుచరులు బొమ్మ గళ్ళ నర్సింలు, బొమ్మగల యాదయ్యలు మరి కొంతమంది సహకారంతో సర్పంచి బందేయ్యేపై దాడికి తెగబడ్డారు. బందేయ్యేపై రాంరెడ్డి అతని అనుచరులు మారణాయుధాలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటన తెలియగానే స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంఘటన స్థలానికి బయలుదేరి వెళ్లారు. గ్రామంలో జరిగిన ఈ ఘాతుకానికి సంబంధించి ఆరా తీశారు. ప్రజలతో కుటుంబ సభ్యులతో అడిగి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో గతంలో రాంరెడ్డి తల్లి మాజీ సర్పంచ్ అరుణ, అదేవిధంగా తండ్రి ప్రతాప్ రెడ్డి మాజీ ఎంపీటీసీగా గ్రామంలో అ కుటుంబానికి రాజకీయ నేపథ్యం ఉంది. గతంలో అభివృద్ధి విషయంలో కూడా రోడ్లు తదితర సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. వాటి బిల్లులకు సంబంధించిన గొడవ కూడా ప్రస్తుత సర్పంచి బందెయ్యకు వారికి మధ్య బిల్లుల విషయంలో కూడా కొన్ని మనస్పర్ధలు విభేదాలు తలెత్తినట్టు తెలుస్తోంది. ఈనెల 24వ తేదీ అర్ధరాత్రి అంతర్జాతీయ శంషాబాద్ విమానాశ్రయంలో అడుగుపెట్టిన రాంరెడ్డి మరుసటి రోజు గ్రామంలో జాతర బిజీలో మునిగిపోయిన సందర్భంగా సర్పంచ్ పై పథకం ప్రకారం హత్య చేసేందుకు కుట్ర పన్నినట్లు చౌదరి గూడా మండల పోలీసుల విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ఘటన అనంతరం కారులో పారిపోతున్న రాంరెడ్డి అతని అనుచరులు బొమ్మగల నరసింహులు బొమ్మగల యాదయ్యలను పోలీసులు వెంబడించారు. షాద్ నగర్ వద్ద సమాచారం అందుకున్న రాంరెడ్డి కారులో నుంచి పరారవ్వగా, మరో ఇద్దరు బొమ్మగల నరసింహులు, బొమ్మగల యాదయ్యలను సంఘటన స్థలంలోని పోలీసులు అరెస్టు చేశారు. అదేవిధంగా అక్కడి నుండి పరారయ్యే క్రమంలో రాంరెడ్డి కారులోనే పాస్పోర్ట్, ల్యాప్ టాప్ వదిలి పరారయ్యాడు. పోలీసులు వాటిని స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు.



నిందితుడు రాంరెడ్డి

# ప్రాణాలు తీసిన ఈత సరదా

**నీట మునిగి ఇద్దరు యువకులు మృతి**

**అత్తాపూర్ ఏప్రిల్ 26, ప్రభాతవార్త :** హిమాయత్‌సాగర్‌లో ఈత సరదా ఇద్దరు ప్రాణాలు తీసింది. ఆదివారం సరదాగా గడిపేందుకు వచ్చిన నలుగురు స్నేహితులు నీటిలోకి దిగారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు సాగర్‌లో గల్లంతు అయ్యారు. మిగిలిన ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. స్నేహితు లను కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని గజ్జ ఈతగాల సహాయంతో మృతదేహాలను వెలికితీసి విచారణ చేయగా టోలిచౌకి హాకింపేట్ కాలనీకి చెందిన షాబాజ్ (24), రంగారెడ్డి పిరం చెరువుకు చెందిన షేక్‌సల్మాన్(22)లు గుర్తించారు. అనంతరం మృతదేహాలను హాస్పిటల్‌కు తరి లించి ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి, యువకులు అక్కడికి రావడానికి కారణాలేమిటి ప్రమాదం ఎలా జరిగింది అనే అంశాలపై దర్యాప్తు చేపట్టారు.



మృతిచెందిన మత్స్యసంపద

# మురుగు నీటి పాలవుతున్న మత్స్యకారుల బతుకులు

**గుండ్లపోచంపల్లిలో వేల సంఖ్యలో చేపల మృతి**

**చెరువుల్లోకి విల్లాల డ్రైనేజీ నీరు..**

**రూ. 20 లక్షల మేర మత్స్యకారులకు నష్టం**

**కలుషిత నీటితో విషతుల్యమైన చెరువులు**

**ఆక్సిజన్ అందక ప్రాణాలు వదులుతున్న చేపలు**

**అధికారుల నిర్లక్ష్యంపై మత్స్యకారుల ఆగ్రహం**

**మేడ్చల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లాలోని గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న గుండ్ల మరియు నీళ్ల చెరువుల్లో కలుషిత డ్రైనేజీ నీరు చేరడంతో చేపలు పెద్ద ఎత్తున మృతి చెందాయి. చెరువుల పరిసర ప్రాంతాల్లో నిర్మించిన విల్లాలు, అపార్ట్‌మెంట్ల నుండి వెలువడే మురుగు నీటిని నేరుగా చెరువుల్లోకి వదలడం వల్లే నీటి నాణ్యత క్షీ ణించిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విల్లాల నుండి వచ్చే డ్రైనేజీ నీటి కారణంగా చెరువు నీరు నల్లగా మారి దుర్వాసన వెదజల్లుతోందని, ఇది చేపల మరణానికి ప్రధాన కారణమైందని వారు పేర్కొన్నారు. చెరువుల్లోకి చేరుతున్న ఈ కలుషిత నీటిలో రసాయనాలు, బ్యాక్టీరియా మరియు విషపూరిత పదార్థాలు అధికంగా ఉండటం వల్ల నీటిలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోయి చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన వల్ల సుమారు రూ. 20 లక్షల వరకు నష్టం వాటిల్లిందని, చేపల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోవడంతో తమకు ఆదాయం లేకుండా పోతోందని మత్స్యకార కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. కలుషిత నీటి సమస్యపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని మత్స్యకార సంఘం అధ్యక్షుడు హన్మంత్ విమర్శించారు. ఇప్పటికైనా కాలుష్య నియంత్రణ శాఖ , స్థానిక మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించి, చెరువుల్లోకి మురుగు నీరు చేరకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు డిమాండ్

